నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
3 | శనివారం 8 జూన్ 2024 | MAHABUBABAD


విజయ సంకేతం చూపుతున్న తీన్మార్ మల్లన్న తదితరులు

# ఉత్కంఠ పోరులో కాంగ్రెస్ గెలుపు

- పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న
- రాకేశ్‌రెడ్డి ఎలిమినేషన్‌తో మల్లన్న విజయం
- చివరి వరకు బీఆర్‌ఎస్ అభ్యర్థి గట్టిపోటీ
- సుదీర్ఘంగా సాగిన కౌంటింగ్ ప్రక్రియ

నల్లగొండ ప్రతినిధి, జూన్7(నమస్తే తెలంగాణ) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించారు. మూడ్రోజుల పాటు ఉత్కంఠగా సాగిన ఓట్ల లెక్కింపులో ఎలిమినేషన్ రౌండ్స్‌తో ఆయన విజయం ఖరారైంది. ఆది నుంచి హోరాహోరీగా సాగిన పోరులో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలో రెండో స్థానంలో ఉన్న రాకేశ్ రెడ్డి ఎలిమినేషన్‌తో మల్లన్నను విజయం వరించింది. పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికల పోరు మొదటి నుంచి చివరి వరకూ ఆసక్తికరంగా సాగింది. బుధవారం ఉదయం 8 గంటల నుంచి మొదలైన కౌంటింగ్ ప్రక్రియ ఉత్కంఠను రేకెత్తించింది. ప్రధాన అభ్యర్థులుగా కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్‌ఎస్ నుంచి రాకేశ్ రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్‌రెడ్డితోపాటు స్వతంత్ర అభ్యర్థులు కలిపి మొత్తం 52 మంది ఉప ఎన్నిక బరిలో నిలిచారు. గత నెల 27న పోలింగ్ జరిగింది. పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 4.63లక్షల ఓట్లు ఉండగా, 3,36,013 ఓట్లు పోలయ్యాయి. నల్లగొండ శివారులోని దుప్పలపల్లి వేర్ హౌసింగ్ గోదాముల్లో మూడ్రోజుల పాటు కౌంటింగ్ సాగింది. బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు మొదలుపెట్టగా గురువారం రాత్రి 10 గంటలకు పూర్తయ్యింది. దాంతో అప్పుడు చెల్లని 27,978 ఓట్లను పక్కన వేసి చెల్లిన ఓట్ల నుంచి గెలుపు కోటాను నిర్ధారించారు. మొత్తం 1,55,095 ఓట్లు సాధించిన అభ్యర్థి గెలుపొందుతారని ప్రకటించారు. గురువారం రాత్రి 10 గంటల నుంచి ఎలిమినేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో అతి తక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థి మొదటగా ఎలిమినేషన్ చేశారు. ఆయనకు వచ్చిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను పైనుంచి మిగిలిన అభ్యర్థులకు పంచుతూ వచ్చారు. ఇలా మొత్తం స్వతంత్ర అభ్యర్థులుగా ఉండి అత్యధిక ఓట్లు సాధించిన అశోక్‌కుమార్ వరకు సాగింది. ఇక్కడ కూడా గెలుపు కోటాకు అవసరమైన ఓట్లు ఎవరికీ రాలేదు. తొలి ప్రాధాన్యత ఓట్లల్లో 18,865 ఓట్ల ఆధిక్యం సాధించిన తీన్మార్ మల్లన్న ఎలిమినేషన్ రౌండ్స్‌లోనూ ఆధిక్యతను కొనసాగించారు. ఆర్‌వో హాల్‌లో చివరి నుంచి పైకి 48 మంది అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియను చేపడుతూ వచ్చారు. కౌంటింగ్ మరింత ఆలస్యం అవుతున్న కారణంగా శుక్రవారం ఆర్‌ఓ హరిచందన అభ్యర్థులతో చర్చించి ఏకకాలంలో తొలి ప్రాధాన్యతలో ఎక్కువ ఓట్లు ఉన్న స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ రౌండ్స్‌ను నాలుగు కౌంటింగ్ హాల్‌లో సమాంతరంగా మొదలుపెట్టారు. 49వ అభ్యర్థిగా ఎలిమినేషన్‌కు గురైన అశోక్‌కుమార్ నుంచి అనధికార లెక్కల ప్రకారం.. తీన్మార్ మల్లన్నకు సుమారు 9వేల ఓట్లు రాగా, రాకేశ్‌రెడ్డికి 8,700 ఓట్ల వరకు వచ్చాయి. తర్వాత ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ రౌండ్‌ను చేపట్టారు. ఇందులో రాకేశ్‌రెడ్డి ఆధిక్యం ప్రదర్శించారు. అనధికార లెక్కల ప్రకారం రాకేశ్ రెడ్డికి 18వేల పైచిలుకు ఓట్లు రాగా, మల్లన్నకు 13వేల పైచిలుకు ఓట్లు వచ్చాయి. వాటితోపాటు దిగువన ఎలిమినేట్ అయిన అభ్యర్థుల నుంచి సబ్ పార్సిల్స్‌లో వచ్చిన ఓట్లను సైతం మల్లన్నకు, రాకేశ్‌రెడ్డికి షేర్ చేశారు. ఈ క్రమంలో మల్లన్న గెలుపు కోటా సుమారు ఐదు వేల ఓట్ల దూరంగా నిలిచిపోగా రాకేశ్‌రెడ్డి 20వేల దూరంలో ఉన్నారు. దాంతో రాకేశ్‌రెడ్డిని కూడా ఎలిమినేట్ చేయడంతో మల్లన్న విజయం ఖాయమైంది. దీంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పటాకులు కాలుస్తూ సంబురాలు చేశారు. ఇది సమష్టి విజయమని తీన్మార్ మల్లన్న వ్యాఖ్యానించారు.

### సుదీర్ఘంగా కౌంటింగ్

కౌంటింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా సాగింది. ఎలిమినేషన్ రౌండ్స్ కూడా 26గంటలకు పైగా కొనసాగాయి. గురువారం రాత్రి 9గంటల తర్వాత బరిలో ఉన్న అభ్యర్థులందరికీ ముందుగా దీనిపై అవగాహన కల్పించారు. ఆ తర్వాత గెలుపు కోటా సాధన కోసం ఎలిమినేషన్ రౌండ్స్‌ను ప్రారంభించారు. ఆర్‌ఓ హరిచందన పర్యవేక్షణలో ఎలిమినేషన్ రౌండ్స్‌లో బరిలో ఉన్న మొత్తం 52 మందిలో తక్కువ ఓట్లు కలిగి ఉన్న వారిని ఒక్కొక్కరిని తొలగించుకుంటూ వారికి వచ్చిన ద్వితీయ తర్వాత ప్రాధాన్యత ఓట్లను మిగిలిన అభ్యర్థులకు పంచుతూ కొనసాగించారు. శుక్రవారం ఉదయం 12 గంటల వరకు 33 మందే ఎలిమినేట్ కావడంతో సుదీర్ఘ సమయం పడుతుందని ఆలోచించారు. దాంతో ఆర్‌ఓ హాల్‌లో అశోక్ కుమార్‌కు దిగువన ఉన్న స్వతంత్ర అభ్యర్థుల ఎలిమినేషన్ రౌండ్స్‌ను కొనసాగిస్తూనే సమాంతరంగా అశోక్‌కుమార్ ఎలిమినేషన్ నాలుగు కౌంటింగ్ హాల్స్‌లో చేపట్టారు. ఆ తర్వాత వెంటనే ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ రౌండ్ చేశారు. వీరిద్దరితోపాటు అంతకు ముందున్న వారి ఎలిమినేషన్ పూర్తయ్యేసరికి రాత్రి 10 గంటలు దాటింది. వీరి ఎలిమినేషన్ అనంతరం అధికారికంగా లెక్కలు తేలేసరికి మరింత సమయం తీసుకుంది. అర్ధరాత్రి రాకేశ్‌రెడ్డి ఎలిమినేషన్‌తో మల్లన్న విజయం ఖరారైంది. దాదాపు 64 గంటలకు పైగా కౌంటింగ్ ప్రక్రియ కొనసాగింది. ఈ కౌంటింగ్‌లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు ఇలా ప్రతి ఒక్కరూ పూర్తి అలసటగా కనిపించారు.

### చెల్లని ఓట్లు గణనీయంగా....

పట్టభద్రుల ఎన్నికల్లోనూ ప్రతిసారి చెల్లని ఓట్లు భారీగా ఉంటుండడం చర్చనీయాంశంగా మారింది. అభ్యర్థుల ప్రచారంలో, సోషల్ మీడియాలో, అధికారికంగానూ ఎంత అవగాహన కల్పిస్తున్నా పట్టభద్రులు ఓటు వేయడంలో తడబాటుకు గురవుతూనే ఉన్నారు. ఈసారి కూడా 27,978 ఓట్లు చెల్లకుండా పోయాయి. మొత్తం ఓట్లలో ఇవి 8.32శాతంగా ఉన్నాయి. ఇక 2021 మార్చి ఎన్నికల్లో 5.57 శాతంతో 21,636 ఓట్లు చెల్లకుండా పోయాయి. 2015 మార్చిలో జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే 9.14 శాతం ఓట్లతో 14,039 ఓట్లు చెల్లలేదు. పోస్టల్ బ్యాలెట్లలోనూ సరైన నిబంధనలు పాటించని కారణంగా పలువురి ఓట్లు చెల్లలేదని తెలిసింది.


ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లను కౌంటింగ్ చేస్తున్న సిబ్బంది

# రేపటి నుంచి నాటకోత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలయ్య

హనుమకొండ చౌరస్తా, జూన్ 7 : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 15వ ఉభయ రాష్ట్రాల తెలుగు ఆహ్వాన నాటిక పోటీలు ఈ నెల 9, 10, 11 తేదీల్లో వరంగల్ పోతన విజ్ఞానపీఠంలో ప్రారంభించనున్నట్లు ఐక్యవేదిక అధ్యక్షుడు కాజీపేట తిరుమలయ్య తెలిపారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో వివరాలు వెల్లడించారు. ఆంధ్ర నుంచి మూడు, తెలంగాణ నుంచి మూడు మొత్తం ఆరు నాటికలు ప్రతిరోజూ రెండు చొప్పున సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్ఆర్ మూర్తి, కళారాజేశ్వర్‌రావు, జీవీ బాబు, వేముల ప్రభాకర్, ఆకుతోట లక్ష్మణ్, జీఎన్ శర్మ, సాదుల సురేశ్, కుసుమ సుధాకర్, కుడికాల జనార్దన్, మలి విజయ్‌రాజ్, జూలూరి నాగరాజు పాల్గొన్నారు.

# హడావిడి.. ఆర్భాటం



- మంత్రి రాకతో బరాజ్‌ల మరమ్మతు పనుల్లో పెరిగిన వేగం
- మేడిగడ్డ, అన్నారంను సందర్శించిన ఉత్తమ్, తదితరులు
- పనుల పురోగతిపై అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్ష
- వానకాలంలోగా పూర్తి చేయాలని ఆదేశం

మహదేవపూర్/కాళేశ్వరం,జూన్ 7: మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ(లక్ష్మి), అన్నారం బరాజ్‌లను శుక్రవారం భారీనీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బృందం పర్యటన నేపథ్యంలో నిర్మాణ సంస్థ హడావిడి, ఆర్భాటం కనిపించింది. మంత్రి రాకతో కొన్ని రోజులుగా నత్తనడకన సాగిన మరమ్మతు పనుల్లో వేగాన్ని పెంచారు. ముందుగా మంత్రుల బృందం అన్నారం బరాజ్ డౌన్ స్ట్రీమ్ 38వ పిల్లర్ వద్ద జరుగుతున్న గ్రౌటింగ్ పనులను పరిశీలించింది. ఈఎన్‌సీ అనిల్ కుమార్, ఈఈ యాదగిరితో మాట్లాడుతూ ఎన్‌డీఎస్ఏ కమిటీ సూచనల ప్రకారం అన్ని పనులు చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సూచించారు. ఇంకో 15 రోజుల్లో అన్ని పనులు పూర్తి చేస్తామని ఇంజినీర్లు తెలిపారు. ఇక్కడ ఇంకా ఏం పనులు చేయాలని మంత్రి అడగగా, సీడబ్ల్యూడీఆర్ఎస్ సాయిల్ టెస్టులు చేయించాలని, వాటికి రూ. కోటికి పైగా ఖర్చవుతుందని చెప్పడంతో రేపటి లోగా నిధులు విడుదల చేస్తామని పేర్కొన్నారు. బరాజ్ నీరు కిందకు వదలడంతో మంచిర్యాల జిల్లాలోని తమ ఊరు మునుగుతోందని, కరకట్ట నిర్మాణం చేయాలని సుందరసాల గ్రామస్తులు కోరగా పరిశీలన చేయండని కలెక్టర్ భవేశ్‌మిశ్రాతో చెప్పారు. అనంతరం మంత్రుల బృందం మేడిగడ్డకు చేరుకొని ఎల్‌సీ క్యాంపు కార్యాలయంలో ఎల్‌టీ ప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులతో మరమ్మతులపై రివ్యూ నిర్వహించారు. పనుల పురోగతిపై చర్చించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్కడి నుంచి బరాజ్‌కు చేరుకొని ఏడో బ్లాక్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. వానకాలంలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ కిరణ్‌ఖరే, రామగుండం, ధర్మపురి, భూపాలపల్లి ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, గండ్ర సత్యనారాయణరావు, సీఈ సుధాకర్‌రెడ్డి, నాగేందర్, ఎల్‌టీ సంస్థ ప్రతినిధి సురేశ్‌కుమార్, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


బరాజ్ వద్ద కొనసాగుతున్న షీట్‌ఫైల్స్ అమరిక పనులు, (ఇన్‌సెట్) అన్నారం బరాజ్‌లో పనులను పరిశీలిస్తున్న మంత్రి తదితరులు



పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

# బాయ్స్ చాంప్ హనుమకొండ

- అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్ భద్రాద్రి కొత్తగూడెం
- మెన్స్ కరీంనగర్, ఉమెన్స్ విజేత ఖమ్మం
- జేఎన్‌ఎస్‌లో ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు


బాయ్స్ అండర్-18 విజేత హనుమకొండకు ట్రోఫీ అందజేస్తున్న ద్రోణాచార్య అవార్డు, జూనియర్ ఇండియన్ చీఫ్ కోచ్ రమేశ్


అథ్లెటిక్స్ పోటీల్లో హైజంప్ చేస్తున్న క్రీడాకారుడు

హనుమకొండ చౌరస్తా, జూన్ 7 : హనుమకొండలోని జేఎన్ఎస్‌లో జరిగిన 10వ తెలంగాణ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నిలిచింది. బాయ్స్ అండర్-18 విభాగంలో హనుమకొండ, అమ్మాయిల విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం, మెన్స్ విభాగంలో కరీంనగర్, ఉమెన్స్ విభాగంలో ఖమ్మం దక్కించుకున్నాయి. పోటీల ముగింపు సమావేశానికి ద్రోణాచార్య అవార్డు గ్రహీత, జూనియర్స్ ఇండియన్ చీఫ్ కోచ్ నాగపురి రమేశ్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ వరదరాజేశ్వరరావు, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్టాన్లీజోన్స్, డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ నాయక్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగబాబు హాజరయ్యారు. యూత్ విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెల 15 నుంచి జరిగే పోటీల్లో పాల్గొంటారు, మెన్, ఉమెన్ విభాగంలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 29 నుంచి హర్యానాలోని పంచకులలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కొదరుపాక సారంగపాణి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి క్రీడల్లో ఆర్థిక సహాయ సహకారాలు అందజేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విజేతలకు మెడల్స్‌తో పాటు బహుమతులు అందజేసి అభినందించారు. పోటీల్లో 32 జిల్లాల నుంచి 971 మంది క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు 60 మంది టెక్నికల్ అఫీషియల్స్ 30 మంది అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

# వికటించిన వైద్యం

- బాధితురాలి చేయి తొలగించాలని వైద్యుల సూచన
- ఆందోళన వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు


రంగుమారిన చేయి

ఐనవోలు, జూన్ 7: వైద్యం వికటించడంతో బాధితురాలి కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.. మండలకేంద్రానికి చెందిన గందెపల్లి ఉప్పలమ్మ(59) గత 30న రెండుసార్లు వంతులు చేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు ఇంటికే ఆర్ఎంపీ వైద్యుడిని రప్పించారు. పరీక్షించిన అతడు వృద్ధురాలి కుడిచేయికి సెలైన్ ఎక్కించాడు. రెండురోజుల తర్వాత ఆమె చేయి పని చేయకపోవడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చూపించారు. పరీక్షించిన వైద్యుడు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు రెఫర్ చేశాడు.అక్కడికి తీసుకెళ్లగా ఉప్పలమ్మ చేయిని తొలగించాలని వైద్యులు చెప్పారు. అలాగే, ఆమెను వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లాలని పంపించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం కుటుంబ సభ్యులు దవాఖానలో ఆమెను చేర్పించారు. ఉప్పలమ్మ చేయి తొలగించాలని చెప్పడంతో ఆమె కొడుకు, కోడలు గందెపల్లి రాజు, అపర్ణ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### 'ప్రతి రైలులో ఐదు జనరల్ బోగీలు పెంచాలి'

కాజీపేట, జూన్ 7 : ప్రయాణికుల రైళ్లలో ఐదు జనరల్ బోగీలను ఏర్పాటు చేయాలని రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ కోరారు. కాజీపేట రైల్వే స్టేడియం ఎదుట శుక్రవారం ప్రధాన మంత్రికి దేశ వ్యాప్తంగా కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. టు ది ప్రైమ్ మినిస్టర్ ఆఫీస్, 152 సౌత్ బ్లాక్, రైసినా హిల్స్, న్యూఢిల్లీ- 110011 చిరునామకు రైల్వే ప్రయాణికుల బాధను వ్యక్త పరుస్తూ ఉత్తరాలు రాయాలని కోరారు. @PMOIndiaకి X ద్వారా ట్వీట్ చేయాలన్నారు. వివరాలకు 998930141లో సంప్రదించాలన్నారు.


కాజీపేట ఏటీఎంలో మహిళలు డబ్బులు డ్రా చేసుకుంటుండగా వెనుకనే ఉన్న ముఠా సభ్యులు

# ఏటీఎం కార్డు మార్చి రూ.45 వేలు విత్‌డ్రా

**కాజీపేటలో మహిళలను ఏమార్చి మోసగించిన వ్యక్తులు**

కాజీపేట, జూన్ 7 : కాజీపేటలోని ఓ ఏటీఎంలో డబ్బులు డ్రా చేసుకుంటున్న ఇద్దరు మహిళలను మాటలతో మభ్యపెట్టి కార్డుతో ఉడాయించి, మరో ఏటీఎంలో డబ్బులను డ్రా చేసుకుని జల్సాలకు పాల్పడుతున్న ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విద్యానగర్‌కు చెందిన నిర్మల తన అక్క కూతురుతో కలిసి గురువారం సాయంత్రం ఏటీఎంలో డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లింది. నగదును డ్రా చేయడానికి ప్రయత్నించగా డబ్బులు రాలేదు. అప్పటికే ఆ ఏటీఎం కేంద్రంలో ఉన్న ముఠా సభ్యులు ఆ మహిళలను మాటలతో నమ్మించి కార్డును తీసుకుని డ్రా చేస్తున్నట్లు నటించారు. కార్డును మార్చి వేరే కార్డును చేతిలో పెట్టారు. మహిళ మరో ఏటీఎం కేంద్రంలోకి వెళ్లి డబ్బులు డ్రా చేసేందుకు ప్రయత్నించగా రాలేదు. ఇంతలో నిర్మల సెల్‌ఫోన్‌కు రూ.45 వేలు డ్రా అయినట్లు మేసేజ్ రావడంతో కంగుతున్నది. వెంటనే ఆమె తమ చేతిలో ఉన్న కార్డును చూసి తాము మోసపోయినట్లు తెలుసుకుని బ్యాంక్ మేనేజర్‌కు సమాచారమిచ్చి ఖాతాను స్తంభింపజేసింద. సదరు మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుల కోసం వేట ప్రారంభించగా విష్ణుపురి రోడ్డులో ఒక వ్యక్తి పట్టుబడ్డాడు. నిందితుడు మద్యం తాగి ఉండడంతో పోలీసులు ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఈ కేసులో మరో ఇద్దరికి సంబంధం ఉన్నదని సీఐ సుధాకర్‌రెడ్డి చెప్పారు.

# అందరి నిర్ణయం మేరకే ముందుకెళ్తాం


మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, పక్కన ఎమ్మెల్యే రేవూరి, కడియం, నాగరాజు

- రాజముద్రలో కాకతీయ కళాతోరణం తొలగించలేదు
- ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

హనుమకొండ చౌరస్తా, జూన్ 7: రాజముద్రలో కీర్తి తోరణం తొలగించలేదని, క్యాబినెట్‌లో సీఎం రేవంత్ రెడ్డి చర్చిస్తున్నారని, అందరి నిర్ణయం మేరకే ముందుకెళ్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. శుక్రవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాకతీయ తోరణంపై కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని, తొలగిస్తామనే విషయం ఇంకా బయటికి రాలేదని అన్నారు. లోక్‌సభ ఎన్నికలను రిఫరెండంగా తీసుకున్నామని, ఆరు గ్యారెంటీలను పథకాలను అమలు చేస్తామన్నారు. కడియం శ్రీహరితో కడియం కావ్యకు ఎఫెక్ట్ అయిందన్నారు. దేశంలో బీజేపీ డబ్బులు పంచి గెలిచిందని ఆరోపించారు. ఎంపీ కడియం మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్, ఇండస్ట్రియల్ కారిడార్, కోచ్ ఫ్యాక్టరీ, ఐటీ కంపెనీలు తీసుకొచ్చి ఇక్కడి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తానన్నారు. వరంగల్ ప్రజలు లౌకికవాదాన్ని కోరుకున్నారని, మతతత్వ బీజేపీని ఓడించారన్నా రు. తనను నమ్మి టికెట్ ఇచ్చిన సోనియాగాంధీ, మల్లికార్జున కర్గే, ప్రియాంక గాంధీ, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. దేశానికి ప్రజాస్వామ్య మే శ్రీరామరక్ష, రాజకీయ పార్టీల విశ్లేషణ ఎగ్జిట్ పోల్స్‌కు అందని రిజల్ట్స్ ఇచ్చిన వరంగల్ ప్రజలు చాలా గొప్పవారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. వరంగల్ ప్రజలు ఊహించని మెజార్టీతో గెలిపించారని కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి అన్నారు. సోషల్ మీడియా సంపూర్ణ మద్దతు ప్రకటించిందని పేర్కొన్నారు. సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పీసీసీ సెక్రటరీ బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాయిని లక్ష్మారెడ్డి, దండ్రె చిన్నా, సీనియర్ నాయకులు వీసం సురేందర్‌రెడ్డి, వంశీ పాల్గొన్నారు.

### ఇంకా ఎడమొహం పెడమొహమే..

మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఇద్దరు ఇంకా ఎడమొహం పెడమొహంగా ఉన్నారు. ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే రీతిలో ఉన్నా పార్టీలో అందరినీ కలుపుకునిపోవాలని మాట్లాడుకోకుండా ముందుకెళ్తున్నారు. కాగా ఇటీవల జరిగిన ఫోన్ సంభాషణతో ఇద్దరి మధ్య విభేదాలు కొనసాగుతుండడం తెలిసిందే. సమావేశానికి మంత్రి ఆలస్యంగా రావడంపై ప్రకాశ్‌రెడ్డి క్షమాపణ చెప్పడంపై నాయకులు, కార్యకర్తలు అవాక్కయ్యారు.

# పెద్ద చెరువు వద్ద రైతుల ఆందోళన

**షెట్టర్లను సరిచేయాలని డిమాండ్**


రిజర్వాయర్ షెట్టర్లను సరిచేయాలని ఆందోళన చేస్తున్న రైతులు

పర్వతగిరి, జూన్ 7: మండలకేంద్రంలోని పెద్ద చెరువు రిజర్వాయర్ వద్ద పలువురు దళిత రైతులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. రిజర్వాయర్ రెండు తూములకు అధికారులు షెట్టర్లను సరిగా అమర్చకపోవడంతో మూడేళ్ల నుంచి సరిగా పంటలు పండించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తూముల నుంచి 24 గంటలపాటు నీరు బయటకు వచ్చి పంట పొలాల మీదుగా పారుతోందన్నారు. దీంతో భూములు జాలువారి పంటలు సాగు చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. సుమారు 50 ఎకరాల్లో ఏటా పంట నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు బొట్ల వెంకన్న, అర్షం జయమ్మ, కాసర్ల ప్రభాకర్, బొట్ల పుష్పమ్మ, సింగారపు యాకయ్య, చేరాలు, దర్గయ్య, కనుకరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. షెట్టర్లను సరిచేసి వానకాలం సాగుకు సహకరించాలని అధికారులను కోరారు. అంతేకాకుండా తూము నుంచి పోలకమ్మ చెరువు వరకు సీసీ వేసి కాల్వ నిర్మాణం చేపట్టాలని కోరారు.